
# శ్రీ మల్లికార్జున స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

- వేడుకగా శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు
- ఘనంగా ఎల్లమ్మ కళ్యాణం , బోనాలు
- హాజరైన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి
- ఘనంగా సత్కరించిన యాదవ సంఘం సభ్యులు



**కౌడిపల్లి జనవరి 28 ( సిరి న్యూస్) :** శ్రీ మల్లికార్జున స్వామి కృప కటాక్షాలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మా రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కౌడిప ల్లి లో శ్రీ గోకుల్ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా వేడుకగా జరుగుతున్నాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యా ణం బోనాలు ఒగ్గు పూజారులు ఒగ్గు శేఖర్ బృందం ఐనోల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సునీత రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యాదవ సంఘం సభ్యులు ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికి ఆలయంలో ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సునీత రెడ్డిని యాదవ సంఘం సభ్యులు శాలువాలతో ఘ నంగా సత్కరించారు .ఈ సందర్భంగా సునీత రెడ్డి మాట్లాడుతూ.... జాతర ఉత్సవాలతో గ్రామాలలో భక్తి భక్తి భావం పెంపొందుతుందని ప్రతి ఏటా యాదవ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు వేడుకగా నిర్వహిస్తారని సంఘం సభ్యులకు అభినందనలు తెలియజేశారు. స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు సారా రామా గౌడ్, మాజీ సీ డీ సీ చైర్మన్ చిలుముల దుర్గారెడ్డి ,యువ నాయకులు పోల నవీన్ కుమార్, వార్డు సభ్యులు చిలుముల రాజీవ్ రెడ్డి ,మంగళపర్తి సందీప్ కుమార్, నాయకులు సంగప్ప, రాజశేఖర్ ,కళ్యాణ్ కౌడిపల్లి యాదవ సంఘం సభ్యులు వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.







## బోర్పట్ల మాజీ సర్పంచ్ మామిడి గారి మల్లారెడ్డి మృతి

**హత్నూర:జనవరి 28 (సిరి న్యూస్)** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బోర్పట్ల గ్రామ మాజీ సర్పంచ్ మామిడి గారి మల్లారెడ్డి బుధవారం తుది శ్వాస విడిచారు. మల్లారెడ్డి 1960 నుండి 1980 వరకు సర్పంచిగా సేవలందించారు. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మనుమడు గంగారెడ్డి ప్రస్తుతం బోర్పట్ల సర్పంచ్ గా కొనసాగుతున్నారు. మల్లారెడ్డి నంది ఎల్లయ్య, జగన్నాథరావుకు అత్యంత సన్నిహితునిగా మెలిగారు. మల్లారెడ్డి మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలు బూర్పట్ల గ్రామంలో గురువారం ఉదయం 11 గంటలకు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలియజేశారు.

# నిరుపేదల.. గ్రామస్తుల పోరాటం ఫలించింది

- కొండాపూర్ లో అక్రమంగా ఆక్రమించిన 144 సర్వేనెంబర్ భూమి ప్రభుత్వము దే.
- లక్షలు వెచ్చించి ప్లాట్ కొనుగోలు చేసిన లబ్ధిదారుల పరిస్థితి ఏమిటి





**మనోహరాబాద్, జనవరి 28. సిరి న్యూస్ :** మండలంలోని కొండాపూర్ గ్రామంలో అక్రమంగా ఆక్రమించిన 144 సర్వే నెంబర్ లోని 11.37 ఎకరాల భూమి ప్రభుత్వం దేనని రెవెన్యూ అధికారులు తేల్చి చెప్పారు. ఈ భూమిలో వెంచర్ ఏర్పాటు చేయగా లక్షలు వెచ్చించి ప్లాట్లు కొనుగోలు చేసిన లబ్ధిదారుల పరిస్థితి ఏమిటని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కొండాపూర్ గ్రామంలో సర్వేనెంబర్ 144లోని 11.37 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది రియల్ వ్యాపారులు ఇటు రాజకీయ నాయకులు, అటు రెవెన్యూ అధికారుల అండదండలతో కారిజ్ ఖాతాగా ఉన్న ఈ భూమిని పట్టా భూమిగా మార్చుకున్నారు. అంతకుముందు ఎంతోమంది నాయకులు ఈ భూమిలో గ్రామంలో ఇంటి స్థలాలు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అదే నాయకులు రియల్ వ్యాపారులతో చేతులు కలిపి పట్టాగా మార్చుకొని పెద్ద ఎత్తున లక్షల సొమ్ము చేసుకున్నారు. ఇది తెలుసుకున్న గ్రామస్తులు ఆందోళనలు, నిరాహార దీక్షలు చేపట్టారు. అయినా అధికారులకు నిరుపేదలపై కనికరం లేకుండా పోయింది. రియల్ వ్యాపారులు ఇచ్చిన లంచాలకు ఆశపడి ప్రభుత్వ భూమిని పట్టాగా మార్చారు. దీంతో రియల్ వ్యాపారులు భూమి చుట్టూరా ప్రీ కాస్ట్ వాలు కూడా నిర్మించి ప్లాట్లు చేశారు. పోరాడితే పోయేది ఏమీ లేదని తెలుసుకున్న గ్రామస్తులు 2024లో రాష్ట్ర మంత్రులైన దామోదర్ రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేశారు. ఇది ప్రభుత్వ భూమి... అక్రమంగా రెవెన్యూ అధికారులు పట్టాగా మార్చారు. నిరుపేదల నోట్లో మట్టి కొట్టారు అంటూ ఫిర్యాదులు అందజేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో, నలుగురు తాసిల్దార్లతో కమిటీ వేసి విచారణ చేపట్టారు. విచారణ చేపట్టిన అధికారులకు అసలు విషయాలు బయటపడ్డాయి. గత రికార్డులలో ప్రభుత్వ భూమిగా గుర్తించారు. గత మూడు నెలల నుండి ఈ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ లను చేయడం లేదని తాసిల్దార్ ఆంజనేయులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నాయకులు, రెవెన్యూ అధికారుల అండదండలతో ప్రభుత్వ భూమిని పట్టాగా చేసుకుని రియల్ వ్యాపారులు పెద్ద ఎత్తున ప్లాట్లు ఏర్పాటు చేసి అమ్ముకొని సొమ్ము చేసుకున్నారని ఆరోపిస్తున్నారు. తక్షణమే వారిపై చర్యలు తీసుకొని గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలను పంపిణీ చేసి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.